క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 30వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ సబ్బులు, నూనె పంపిణీ చేశారు. స్థానిక వార్డు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె , యూనిఫారం ఇస్తోందన్నారు. ఈ సారి కూడా క్రమం తప్పకుండా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

కడప అర్బన్ : రోడ్డు భద్రతపై జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది వాహనదారులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడప నగరంలోని మహావీర్ సర్కిల్, శంకరాపురం వద్ద వున్న టాక్సీ స్టాండ్‌లో ఆటోడ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐలు వెంకటయ్య, సుబ్రమణ్యంలు అవగాహన కల్పించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, ఓవర్‌లోడ్‌తో ప్రయాణించరాదని అవగాహన కల్పించారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర పాలక సంస్థలోని 45వ డివిజన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని 45వ డివిజన్ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగర శివార్లలోని 45వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని సచివాలయంలో డివిజన్ పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను అందజేశారు.

విభజన హామీలను నెరవేర్చాలి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని ఆర్ఎస్‌యూ కార్యాలయంలో రాష్ట్ర కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన సందర్భంగా ఏపీకి ఇచ్చిన విభజన హామీలు అమలు కోసం అనేక ఉద్యమాలు చేసినా కేంద్రం స్పందించకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, అన్ని జిల్లాల అధ్యక్షులు క్రిష్టారెడ్డి, ప్రశాంత్, నాగరాజు, జై సింహారెడ్డి, చరణ్, చందు, బీమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలండర్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆవిష్కరించారు. శనివారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి న్యాయ సహాయం కావాలన్నా అందిస్తున్న ఎస్‌జేడబ్ల్యుహెచ్‌ఆర్‌సీ సేవలు అభినందనీయమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, బండిప్రసాద్, తోటక్రిష్ణ, ఆ సంస్థ సభ్యులు కె. రవిబాబు, కె. ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసకు మద్దతుగా ప్రచారం

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా నగరంలో ప్రచారం నిర్వహించారు. అప్సర సర్కిల్ వద్దనున్న ట్రాన్స్ కో నిలయం, స్విస్ట్ కళాశాల, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, బసిరెడ్డి లా కళాశాల, 4వ డివిజన్ వార్డు సచివాలయంలో ఆయన మద్దతుదారులు కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎన్. వెంకటరామిరెడ్డి, రాము, మల్లేశ్వర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మూతపడిన బోటింగ్ యూనిట్‌ను తెరవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేవుని కడప చెరువు కట్ట వద్ద మూత పడిన బోటింగ్ యూనిట్‌ను తెరవాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. శనివారం దేవుని కడప చెరువు కట్ట వద్ద మూతపడిన బోటింగ్ యూనిట్‌ను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఆపరేటర్ లేక దేవుని బోటింగ్ షికారు మూతపడిందన్నారు. దేవుని కడప బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో బోటింగ్ చేసే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. అధికారులు ఆపరేటర్‌ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, బ్రహ్మం, మల్లిఖార్జున, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

రహదారి భద్రతను పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రమాదాలకు దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా రహదారి భద్రతలను పాటించాలని డిస్టిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్(డిటిఓ) మీరా ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా స్వచ్ఛత పక్వాడ- 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సురేష్‌బాబు, కళాశాల సిబ్బంది, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉన్నారు

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక 41వ డివిజన్‌లోని రవీంద్రనగర్‌లో మియ్యా కూల్‌డ్రింక్స్ షాపు నుంచి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. దాంతోపాటు ప్రజల సమస్యలను కూడా తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా చిల్లర దుకాణం నడిపే షేక్ అబ్దుల్ సలాంకు జగనన్న తోడు పథకాన్ని వర్తింపజేయాలని డిప్యూటీ సీఎం సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. తన భర్త చనిపోయాడని, ఇంకా వితంతు పింఛన్ అందలేదని ఫాతిమా అనే మహిళ తెలుపగా, పింఛన్ ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాయపాటి కుల్లాయమ్మ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి వివిధ పథకాల వల్ల రూ.10.33 లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ మళ్లీ రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, షఫీ, బంగారు నాగయ్య, మధు, రామ్మోహన్‌రెడ్డి, పస్తం అంజి, షఫీవుల్లా, కొండయ్య, మురాద్, హయద్, మహబూబ్‌బాషా, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, మూలే సరస్వతి, మల్లీశ్వరి, తులశమ్మ, పద్మ పాల్గొన్నారు.

నేడు 'వాల్మీకి రామాయణ నామ సంగ్రహం' పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరంలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు వాల్మీకి రామాయణ నామ సంగ్రహం అనే పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు వేమిరెడ్డి సులోచనదేవి రచించారు. కడప నగరంలో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి సహధర్మచారిణిగా ఆమె సుపరిచితురాలు.

పుస్తకావిష్కరణ కార్యక్రమానికి రిటైర్డ్ ఇంజనీరు, రామాయణ మహాభారతాలపై పట్టు కలిగిన పుత్తా పుల్లారెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర హాజరు కానున్నారు. సిలీకాంధ్ర విశ్వవిద్యాలయం డిపార్టుమెంటు ఆఫ్ లింగ్విస్టిక్ ప్రొఫెసర్ అద్దంకి శ్రీనివాస్ గ్రంథ సమీక్షకులుగా పాల్గొంటున్నారు. ప్రత్యేక అతిథిగా స్థానిక శ్రీ అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు గండ్లూరు నారాయణరావు పాల్గొననున్నారు.

జాతీయ సెమినార్‌కు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఈనెల 29న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఉర్దూ సెమినార్, కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను సెమినార్ కన్వీనర్ అబ్దుల్‌గనీ, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్‌లు శనివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూకు మహర్దశ కల్పించే ఉద్దేశంతో జాతీయస్థాయి సెమినార్‌ను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించి ఉర్దూ విద్యాసంస్థలకు పూర్వ వైభవం కల్పించాలని కోరారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాష స్పందిస్తూ ఉర్దూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ ఇన్‌చార్జు ఎస్‌బి అహ్మద్‌బాష పాల్గొన్నారు.

నాటకాభివృద్ధికి వైవీయూ కృషి అభినందనీయం

ప్రసిద్ధ నాటకకర్త పల్లేటి కులశేఖర్



నాటకకర్త పల్లేటి లక్ష్మీకర్‌ను సన్మానిస్తున్న లలితకళల విభాగం అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : కాలంలో తెరమరుగవబోతున్న నాటకాన్ని అభివృద్ధి చేయడానికి వైవీయూ లలితకళల విభాగం, రంగస్థల కళల అధ్యాపకులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రసిద్ధ నాటకకర్త పల్లేటి లక్ష్మీకులశేఖర్ పేర్కొన్నారు. ఇటీవల ప్రతిష్టాత్మక అప్పాజోస్యుల-విష్ణుబొట్ల-కందాళం ఫౌండేషన్ వారి విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం పొందిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్ శనివారం వైవీయూను సందర్శించారు. ఈ సందర్భంగా లలితకళల విభాగం ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పల్లేటి లక్ష్మీకులశేఖర్ మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలన్నింటిలో నాటకం గొప్పదని, ప్రజా హృదయాలను అలరించి, స్పందింపజేసే లక్షణం, ప్రజల కష్టసుఖాలను, ప్రత్యక్షంగా చూపగలిగే సత్తా ఒక్క నాటకానికే ఉందన్నారు. 'రాయలసీమ నాటకం చరిత్ర అధ్యయనం' అన్న అంశంపై ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యయనం చేసి సీమ నుంచి వందలాది గొప్ప నాటకాలు వచ్చాయని నిరూపించారని పేర్కొన్నారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రంగస్థల కళల కోర్సు రాయలసీమలో కేవలం వైవీయూలో మాత్రమే ఉందని, కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లలితకళల విభాగం అధ్యాపకులు సి. వెంకటేష్, డా. కె. రెడ్డిశేఖర్‌రెడ్డి, సి. అప్పలాచారి, బి. చిన్నరాయుడు, బి.ఈరప్ప, వి. సుధాకర్, డా. టి. సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఎస్ సొల్యూషన్ సెంటర్ హెడ్ యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఏవై-ఎన్‌యూఎల్ఎం, ఏపీ మెప్మా ద్వారా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన వారు బ్యూటీషియన్, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, టీవీ రిపేరు టెక్నీషియన్, ఇంటర్మీడియేట్ అర్హతతో లాగిస్టిక్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. 60-65 రోజులపాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 81060 59836, 99089 74770 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

డ్రైవర్లకు కంటి చూపు చాలా ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు చాలా ముఖ్యమని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవరు మంచి శిక్షణతో పాటు కంటి చూపు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నాగ రాజు, అడిషనల్ డీయం అండ్ హెచ్‌వో ఉమామహేశ్వర్, ఎంవీఐలు విజయ్ భాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 25న ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం-విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం అని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ పట్నంలో జరిగే కార్మిక మహా గర్జనకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23, 24 తేదీల్లో కడప రెవిన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ఆందోళన, 25న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, వేణుగోపాల్, నాగ సుబ్బారెడ్డి, కెసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై అయ్యన్న వ్యాఖ్యలు దారుణం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : పోలీసులపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చింతకాయల అయ్యన్న పాత్రుడు భ్రమల్లో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తాను హోంమంత్రిని అవుతానని, అప్పుడు పోలీసుల సంగతి తేలుస్తానని బెదిరించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయ్యన్న పిచ్చిపట్టినట్లుగా అలా మాట్లాడుతుంటే చంద్రబాబు ఆయన్ను నియంత్రించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆయన తాను చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపపడి పోలీసులకు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ పాఠశాలలో వారిని శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉషశ్రీ, మౌనిక, సుజిత, సుమిత్ర పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. వీరు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అంకాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు తెలుగులో నిర్వహిస్తామనడం సంతోషకరం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత ప్రభుత్వం స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ అంతర్భాగంలోని మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగ నియామక పరీక్షలు హిందీతో పాటు తెలుగుతో పాటు 13 అధికారిక భాషలలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం సంతోషకరమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ద్రావిడ సురేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం నిర్వహించే ఉన్నత విద్య ఉద్యోగ నియామక పరీక్షలు తెలుగులో నిర్వహించాలని చాలా రోజులుగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి వినతి పత్రం ద్వారా విన్నవించగా ఆయన ప్రధాన మంత్రికి లేఖ రాయడం జరిగిందన్నారు. దీని ఫలితంగానే 13 అధికారిక భాషలలో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాగేంద్ర, చైతన్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

23న ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23న ఉదయం 9 గంటలకు నేతాజీ సోషియల్ క్లబ్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభాపరీక్ష నిర్వహించనున్నట్లు క్లబ్ కన్వీనర్ డి.భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా జిల్లాలోని 36 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో తెలుగు, ఇంగ్లిషు మీడియాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.1000లతోపాటు 10 కన్సోలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడు డి.నాగరాజారావు, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, కోశాధికారి కృష్ణమోహన్‌రావు, కార్యదర్శి షహబుద్దీన్, పద్మనాభరాజు, గురుకుమార్, మధుమతి, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, గిరిజనులకు నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో సబ్ ప్లాన్ చట్టాన్ని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంగా మార్చాలని కోరుతూ వివిధ రాజకీయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం త్వరలో కాలపరిమితి ముగుస్తున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరించి ప్రత్యేక నిధిగా శాశ్వత ప్రాతిపదికన అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు నీలి శ్రీనివాస రావు, మునెయ్య, సుధీర్, వెంకట రమణ, జయన్న, వేణుగోపాల్, సీఆర్‌వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయిని మించి మాట్లాడటం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం : టీడీపీ నాయకులు స్థాయిని మించి మాట్లాడటం తగదని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సాధిక్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చెబుతున్న ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే రైతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నారన్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రతి 2 వేల జనాభాకు ఒక ఆర్‌బీకే నిర్మించి, వాటి ద్వారానే అన్ని రకాల సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆర్‌బీకేలను సందర్శించడానికి దేశంలోని అన్ని రాష్ట్రాల మంత్రులు, వ్యవసాయాధికారులు వస్తున్నారని, పరిశీలించి కితాబిస్తున్నారని వివరించారు. అలాంటి ఆర్‌బీకేలను టీడీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారని, ఏప్రిల్ నుంచి రైతుల పొలాలకు సంబంధించిన భూసార పరీక్షలన్నీ నియోజకవర్గ కేంద్రాల్లోనే చేస్తారన్నారు. భూరక్ష పథకం ప్రారంభించి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రవి శంకర్, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, నారపురెడ్డి, చంద్రపాల్ పాల్గొన్నారు.

బాలసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అక్కాయపల్లెలోని బాలసదన్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఉంటున్న గదులను పరిశీలించారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి హెచ్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దరఖాస్తు నమూనా ఫారాలు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఏపీ టీడబ్ల్యూఎస్(ఆర్) రాయచోటి పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ఉదయం 10 గంటలకు రాయచోటి పాఠశాలలోనే నిర్వహించే డెమో, ఇంటర్వ్యూకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 7382264994 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్యాట్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం



క్యాట్ ఫలితాలలో సత్తాచాటిన విద్యార్థులతో చైతన్య ఏజీఎం రమణయ్య

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా 2023 జనవరి 21వ తేదీన క్యాట్ ఒలంపియాడ్ వారు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలను నిర్వహించారు. ఇందులో కడప జోన్ నుంచి 74 మంది విద్యార్థులు క్యాష్ అవార్డులను, 303 మంది మెడల్స్‌ను, రూ. 78 వేలు ప్రైజ్‌మనీని తమ విద్యార్థులు గెలుపొందారని చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

31న డాన్‌బోస్కో ఐటీఐ గోల్డెన్ జూబ్లీ వేడుకలు



మాట్లాడుతున్న ఫాదర్ విద్యాసాగర్

కడప కార్పొరేషన్ : కడప సెయింట్ జోసెఫ్ ఆంతోనీస్ ఇన్‌స్టిట్యూట్, డాన్‌బోస్కో ఐటీఐ గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈనెల 31వ తేది నిర్వహిస్తున్నట్లు ఫాదర్ విద్యాసాగర్ తెలిపారు. శనివారం స్థానిక డాన్‌బోస్కో ఐటీఐలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1968లో డాన్‌బోస్కో ఐటీఐ ఏర్పడిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ వేల మంది విద్యార్థులు ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకుని వివిధ దేశాల్లో , పలు ఉద్యోగాలు, ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. యాభై ఏళ్లకు పైగా రాయలసీమ ప్రాంత విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడంలో తమ సంస్థ ఎంతో ఉపయోగపడిందన్నారు. పునీత డాన్‌బోస్కో అందించిన సేవలు, త్యాగానికి గుర్తుగా ఈనెల 31వ తేది వేడుకలు పండుగలా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. డాన్‌బోస్కో ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో కృషి చేసిన గురువులు, బ్రదర్లు, పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరవుతున్నారన్నారు. ఈ వేడుకలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బ్రదర్లు పి. విజయ్ కుమార్, కృపాకరన్, బాలయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

చెన్నూరు : మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) ఏర్పాటు చేయడం జరిగిందని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేఓఆర్ కాలనీలో సామాజిక ఆరోగ్య కేంద్రం, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకే చోట ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇబ్బందులు ఉండేవని తెలిపారు. కాగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సహకారంతో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఇటు చెన్నూరు టౌన్, అలాగే మైనార్టీ కాలనీ, కొండపేట, బలసింగాయపల్లె, కనపర్తి తదితర గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.

బాలికలపై వివక్ష తగదు



కమలాపురం : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వాణి

కమలాపురం : బాలికలపై వివక్ష చూపడం తగదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పెద్దచెప్పలి గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సూపర్‌వైజర్ మాట్లాడారు. 2015 జనవరి 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బేటి బచావో-బేటి పఢావో పథకాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మాయిల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : బాలికలపై వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ వీరపునాయునిపల్లె సెక్టారు సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. యస్.పాలగిరి సచివాలయ పరిధి నేలతిమ్మాయపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. మగ, ఆడ అనే తేడా లేకుండా పిల్లలను చూసుకుంటామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, భవానీ, హెల్పర్ ఖాశింబీ పాల్గొన్నారు.

చెన్నూరు : ఈ నెల 18 నుంచి 24 వరకు బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా చెన్నూరు మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం చెన్నూరులోని నాగలకట్టవీధి, పరమటవీధి అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఉమామహేశ్వరి, చంద్రకళ, వాసవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందని, దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, గుర్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పద్మావతి, రాధ, తులసి, పద్మ, ఇందిర, మాధవి తదితరులు పాల్గొన్నారు.